‘శివపురం’లో చిన్నప్పుడు కొన్ని రోజులున్నాము. అప్పటికీ ఇప్పటికీ ఊరు గుర్తు పట్టలేనంతగా మారిపోయింది అన్నాడు రాజు.

నా స్నేహితుడి కూతురు పెళ్లికని ‘శివపురం’ వచ్చాను. నాకు సౌకర్యంగా ఉంటుందని మామూలు కాలనీకి కాస్త దూరంగా ఉన్న ఇన్‌స్పెక్టర్ల గెస్ట్‌హౌస్‌లో గదిని బుక్ చేశాడు నా ఫ్రెండు. ‘నీతో పాటు నా ఇంకో ఫ్రెండు గదిలో ఉంటాడు’ అన్నప్పుడు ఒప్పుకున్నాను. ఆ ఇంకోఫ్రెండు రాజు.

రాజు నాకు నచ్చాడు. అంతవరకూ పరిచయం లేకున్నా అతడితో సంభాషణ పెద్ద ఇబ్బందిగా అనిపించలేదు. మనిషి ఫ్రెండ్లీగానే ఉన్నాడు. అలాగని అతి చనువు చూపటం లేదు. అతని మాటల వల్ల ఆయన బాగా చదువుకున్న వాడనీ, ఎన్నో విషయాలు తెలిసిన వాడనీ అనిపిస్తోంది.

అందుకే, రాత్రి భోజనాలయిన తరువాత ‘కాస్సేపు బయట కూచుందాం’ అని అంటే ‘సరే’ అన్నాను.



# హారర్

**కస్తూరి మురళీకృష్ణ**



ఆకాశంలో నక్షత్రాలు మెరుస్తున్నాయి. కీచురాళ్ల శబ్దం వినిపిస్తోంది. అది, ఆరంభంలో కర్ణకఠోరంగా అనిపించినా రానురాను, ప్రకృతి నిశ్శబ్దంలో భాగమైపోయింది. కీచురాయి కాస్సేపుపాట ఆపితే నిశ్శబ్దం వికృతంగా తోస్తోంది. ఇదంతా చూస్తూ ఆనందం అనుభవిస్తున్న నేను, హఠాత్తుగా రాజు అన్నమాటలకు ఉలిక్కిపడ్డాను. అతని వైపు చూశాను.

'చిన్నప్పుడు ఇక్కడ ఉన్నది కొన్నిరోజులే అయినా, ఒక మరుపురాని విచిత్రమైన అనుభవం కలిగింది నాకు ఇక్కడ. ఇప్పుడు అది తలచుకుంటే నిజంగా జరిగిందా అన్న అనుమానం వస్తోంది' అన్నాడు.

'ఏమిటది?' అడిగాను కుతూహలంగా.

'నా చిన్నప్పుడు అంటే బహుశా ఏడెనిమిది ఏళ్లుంటాయేమో, అప్పుడు మా నాన్నగారికి ఇక్కడికి దగ్గరలోని ఊరికి ట్రాన్స్‌ఫర్ అయింది. సౌకర్యంగా ఉంటుందని ఈ ఊళ్ళో అద్దె ఇల్లుకోసం వెతికారు. మేము నలుగురు పిల్లలం. అందుకని కాస్త పెద్ద ఇల్లు కావాలనుకున్నారు నాన్నగారు. ఆయన కావాలనుకున్నట్టే ఇల్లు దొరికింది. రెంటు కూడా తక్కువ. ఎవరయినా ఇంటికివస్తే చాలన్నట్టు ప్రవర్తించాడట ఆ ఇంటి యజమాని. నాన్నగారు అతని ప్రవర్తనకు ఆశ్చర్యపోయారు. కానీ, ఎనిమిది గదుల ఇల్లు. ఇంటిముందు విశాలమైన స్థలం. చక్కనిచెట్లు, ధర తక్కువ. దాంతో 'సరే' నన్నారు.'

నేను వింటున్నానా, లేదా, అన్నట్టు నా వైపో సారి చూసి, మళ్లీ చెప్పటం కొనసాగించాడు.

'ఓ మంచిరోజు చూసి, మమ్మల్ని బయలుదేరతీశారు. సామాన్లన్నీ సర్దుకుని శివపురం చేరాం. ఇంటిముందు బళ్లు ఆపి, సామాన్లు దింపి సర్దుకుంటూంటే, ఊళ్లో వారందరూ గుమికూడి, దూరం నుంచి వింత చూశారు తప్ప, ఒక్కరూ దగ్గరకు రాలేదు. పలకరించలేదు. అది మాకు విచిత్రంగా అనిపించినా పెద్దగా పట్టించుకోలేదు. ఇల్లంతా ఆనందంగా కలియతిరిగాం.

ప్రయాణం వల్ల, సామాన్లు సర్దిన అలసట వల్ల అందరం గాఢంగా నిద్ర పోయాం. కానీ తెల్లారి లేచినా నాకు విశ్రాంతిగా అనిపించలేదు. అలసటగానే ఉంది. మిగతా అందరూ ఆనందంగా, హాయిగా ఉన్నారు. 'నాకే ఏదో అశాంతి. ఏదో గాభరా' చెప్పటం ఆపి నా వైపు చూశాడు.

ప్రశ్నార్థకంగా చూశాను.

'మనం మనకెంతో తెలుసని అనుకుంటాం. కానీ తరచిచూస్తే, ఏమీ తెలియదనిపిస్తుంది. నేను రాత్రిళ్లు నిద్రపోయేవాడిని. కానీ నిద్రపోయి నట్టుండేది కాదు. ఎందుకంటే, రాత్రిళ్లు నా శరీరం నిద్రపోయేది. మనసు నిద్రపోయేది కాదు' .

'అదేమిటీ?' అడగకుండా ఉండలేకపోయాను.

కాస్సేపు మౌనంగా ఉన్నాడు. నిట్టూర్చి చెప్పటం ఆరంభించాడు.

'రాత్రిళ్లు పడుకున్న తరువాత, నేను వేరు. నా శరీరం వేరు అన్న భావన కలిగేది. శరీరం మంచంపై ఉండేది. నేను ఎక్కడెక్కడో తిరిగి వచ్చేవాడిని.

'ఎక్కడెక్కడ?' అడిగాను.

'చిత్ర విచిత్రమైన స్థలాలు. జలపాతాలపై ఎగిరేవాడిని. అడవుల్లో దూకే వాడిని.

నీళ్లల్లో మునిగేవాడిని. వింతవింత నగరాలు తిరిగాను. కట్టడాలు చూశాను. ఎవరెవరినో కలిసేవాడిని. ఏవేవో భాషలలో మాట్లాడే వాడిని. పదాలు అర్థం కాకున్నా, భావం బోధపడేది. ఇలా రాత్రిళ్లు ఎక్కడెక్కడో తిరుగుతుండటం వల్ల తెల్లారి నిద్రలేచినా అలసట తీరేది కాదు. దాంతో రోజంతా డల్‌గా ఉండేది. ఏదీ తినాలనిపించేది కాదు. అన్నలు ఆడుకుంటూంటే, వారితో కలవకుండా ఒంటరిగా ఉండేవాడిని.' 'అంటే రాత్రంతా కలలు కనేవారా?' అడిగాను.

కుర్చీలో వెనక్కువాలేడు. 'కలలు కావచ్చు. నిజం కావచ్చు. ఇప్పుడేమీ సరిగ్గా గుర్తులేదు కానీ, ఏదైనా కొత్తప్రదేశం వెళ్తే, అది కొత్తగా అనిపించదు. కొత్తమనుషులు అపరిచితులుగా అనిపించరు. ఏదైనా సంఘటన జరుగుతూంటే, అది అంతకు ముందు అనుభవించినట్టు అనిపిస్తుంది. ఇప్పుడీ

చీకట్లో, మీతో మాట్లాడుతూంటే ఇలా ఇంతకు ముందు మాట్లాడినట్టు ఇదంతా అనుభవించినట్టు అనిపిస్తోంది'.

ఎందుకో వెన్నులోంచి చలి పుట్టుకొచ్చింది. వొళ్లు కంపించింది.

'నన్ను మీ కలలో చూశారా?' మెల్లగా అడిగాను.

'చూసిన గుర్తులేదు. కానీ, మీరు అపరిచితుల్లాగా అనిపించటం లేదు. అంతేకాదు, ఇప్పుడో, ఇంకాస్సేపో ఏదో జరుగుతోందనిపిస్తోంది. కానీ, ఏం జరుగుతుందో తెలియటం లేదు' అన్నాడు.



## మీరే డిటెక్టివ్!?

నిర్వహణ: అన్య

### కుక్కబుద్ధి

'కుక్కలను పెంచినవాళ్లకే తెలుస్తుంది వాటి విలువేమిటో. మనుషుల కన్నా ఎక్కువ సాయం చేస్తాయవి. బంతిని విసిరేస్తే తీసుకురావడం, గుమ్మంలో వున్న పేపరు తెచ్చివ్వడం లాంటి సరదా ఆటలు మాత్రమే కాదు. ఒకసారి నేర్పించామంటే ప్రాణాలకు తెగించి మరీ సాయం చేస్తాయి. ఓ చిన్నకథ చెబుతాను వినండి. మా తాతదగ్గరో కుక్కుండేది. ఆయనక్కాస్త తిక్క. కొండల్లో, రెండు శిఖరాల మధ్య ఓ హెయిర్‌పిన్ బెండ్‌లో కట్టుకున్నాడు ఇల్లు. ఆ ఒంటరి మనిషికి కుక్కతోడు. వర్షాలకు కొండచరియలు విరిగి పడుతున్నప్పుడు కింద డ్యూటీలో వున్న ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు ఆయన ఎర్రజెండా వూపి సైగ చేసేవాడు. అది సంకేతంగా, ఘాట్‌రోడ్డు మీద వాహనాల రాకపోకల్ని నియంత్రించే వాళ్లు.

ఒకనాడు కింద, ట్రాఫిక్ హెవీగా వున్నప్పుడు రాళ్లు పడటం ప్రారంభ మైంది. మొదట తాతగారి తలమీద రాయిపడటంతో ఆయన స్పృహ కోల్పోయాడు. అంతే కుక్క తెలివేమిటో అప్పుడు తెలిసొచ్చింది. అది వెంటనే ఇంట్లో కెళ్లి రెడ్ టవల్ ఒకటి తీసుకుని, చెంగుచెంగున గెంతుతూ కింద వున్న కానిస్టేబుల్ దగ్గరకెళ్లింది.

ఆ సిగ్నల్ అర్థం చేసుకున్న కానిస్టేబుల్ ట్రాఫిక్‌ను తక్షణమే ఆపేశాడు. ఆనాడు కుక్కే లేకపోతే ఎన్నివందల ప్రాణాలు పోయేవో గదా!'

''నిజమే. కుక్కకున్న బుద్ధి మనుషులకు లేదు. కొయ్యి. కొయ్యి.'' అన్నాడు డిటెక్టివ్.

అవన్నీ కోతలని డిటెక్టివ్ కెలా తెలిసింది?

సమాధానం: ముసలాయన ఎర్రజెండా వూపాడని కుక్కకు తెలియదు. అది ఎర్ర టవల్‌ను గుర్తుపట్టి తీసుకొచ్చే అవకాశం లేదు. ఎందుకంటే కుక్కలు కలర్ బ్లైండ్. రంగుల్ని గుర్తించలేవు.

చాలాసేపు నిశ్శబ్దం తాండవించింది. నిశ్శబ్దాన్ని భంగంచేస్తూ, నేనే అడిగాను 'తరువాత ఏమయిందో చెప్పండి'.

నిద్రలోంచి లేచినట్టు నావైపు మత్తుగా చూశాడు. చెప్పటం ఆరంభించాడు.

''నేను ఎవ్వరితో కలవకపోవడం, అందరికీ దూరంగా ఒంటరిగా ఉండ టం, డల్‌గా ఉండటం, రాత్రిళ్లు త్వరగా నిద్రపోవటం, పొద్దున్న ఆలస్యంగా లేవటం, చూసి మావాళ్లు నన్ను డాక్టరుకు చూపించారు. నాకే సమస్యలేదన్నాడు డాక్టర్. ఇదంతా ఊరు మార్పిడికి అలవాటు పడటంలో భాగం అన్నాడు. కానీ వాళ్లెవరూ ఊహించను కూడా లేదు. ఇదంతా నన్ను మానసికంగా సిద్ధం చేయటం కోసమని'.

'దేనికీ?' అడిగాను.

'చెప్తాగా' అన్నాడు. ఏదో గుర్తు చేసుకుంటున్నట్టు ఆగాడు. 'ఎవరో వస్తున్నారు' అన్నాడు హఠాత్తుగా.

కళ్లు చికిలించి చీకట్లోకి చూశాను. ఎవరూ కనబడలేదు. ఏ శబ్దమూ వినబడటం లేదు. 'అప్పుడు కూడా ఇలాగే అనిపించేది. ఎవరో వస్తారని, ఎవరి కోసమో రోజంతా ఎదురు చూసేవాడిని. రాత్రంతా తిరిగేవాడిని'.

ఎందుకో నా వొళ్లు జలదరించింది. రాజు కళ్లు ఎటో చూస్తున్నాయి.

'ఒకరోజు అందరూ ఎవరిపనుల్లో వాళ్లున్నారు. ఎప్పటిలాగే నేను డల్‌గా, ఒంటరిగా బయట మెట్ల మీద కూర్చుని ఉన్నాను. నాకు మా తోటలో చెట్టు చాటున ఓ పిల్లవాడు కనిపించాడు. వింతగా ఉన్నాడు. అతడి ముఖం వెలుగుతున్నట్టుంది. కానీ ఆ వెలుతురు మామూలుగా మనకు అలవాటయిన వెలుతురులా లేదు. చెట్టుచాటు నుంచి నన్నే చూస్తున్నాడు కోపంగా. ఎందుకో తెలియదు. నాకు తెలియకుండానే నేను అతడి దగ్గరకు వెళ్లాను. అతడు నా చెయ్యి పట్టుకున్నాను. నేను స్పృహ తప్పి పడిపోయాను.' చెప్పటం ఆపాడు.

అన్నీమరచి వింటున్నాను నేను. అతడు ఆపటం భరించలేక పోయాను. 'చెప్పండి' అన్నాను అసహనంగా.

'నేను ఇంట్లో కనబడకపోవటంతో మా వాళ్లు కంగారుపడ్డారు. నా కోసం వెతుకుతుంటే, చెట్టుచాటున పడి కనిపించానట. డాక్టరు దగ్గరకు తీసుకు వెళ్లారు.

'వీక్‌నెస్' అని టానిక్ రాసిచ్చాడు డాక్టర్. కానీ, ఆ రోజు నుంచీ నా ప్రపంచం మారిపోయింది' అని నా వైపు చూసి విచిత్రంగా నవ్వాడు.

ఆ నవ్వు మామూలుగా లేదు. నాకు అక్కడ నుంచి పారిపోవాలనిపించింది. కానీ కాళ్లు కదల లేదు. నేలను అతుక్కు పోయినట్టున్నాయి. నన్ను గమనించనట్టు చెప్పుకుంటూ పోతున్నాడు రాజు.

'ఆ పిల్లవాడు రోజూ నన్ను కలిసేవాడు. ప్రొద్దుటినుంచీ ఇద్దరం కలిసి రకరకాల ఆటలు ఆడేవాళ్లం. ఏవేవో కబుర్లు చెప్పుకునే వాళ్లం. అతడు ఎంతో విచిత్రంగా మాట్లాడేవాడు. విచిత్రమైన చేష్టలు చేసేవాడు. అతనితో ఆటల్లో పడి నేను అన్నీ మరచిపోయేవాడిని. రాత్రి పూట, నా శరీరం నిద్రించగానే, నేను లేచి వెళ్లి అంజితో బయట ఎక్కడెక్కడో తిరిగేవాడిని. చీకటంటే అస్సలు భయం వేసేదికాదు. అతడు పక్కన ఉంటే ఏదీ గుర్తుండేది కాదు. దేనికీ భయం కలిగేది కాదు.' కలలో ఉన్న వాడిలా చెప్పాడు.

'అతడి పేరేమిటి?' నాలిక ఎండిపోతూంటే అడిగాను కష్టంగా. ఎందుకో నాకు ఊపిరి అందటం లేదు.

'తెలియదు. పేరు అడగాలన్న ఆలోచననే రాలేదు. అసలు అతడితో ఉన్నప్పుడు నాకు ఎలాంటి ఆలోచనలు ఉండేవికావు. కానీ, ఎప్పుడూ అతడితోటే ఉండడం, ప్రొద్దున్న రాత్రి తిరుగుతుండడం వల్ల నేను బలహీనమైపోయాను. ఇంట్లో వాళ్లు కంగారుపడ్డారు. 'ఎప్పుడూ ఒంటరిగా ఆ తిరుగుడులేమిటి? తోటలోని, అడవిలోకి వెళ్లకు. పురుగు, పుట్ర ఉంటాయి' అని అరిచేవారు. తిట్టేవారు. అవన్నీ నాకు వేరే ఏదో ప్రపంచం లోంచి వినిపించినట్టు వినిపించేవి. నా లోకం వేరే కదా!' అని నవ్వాడు.

ఎందుకో తెలియదుకానీ, ఎవరో మమ్మల్ని చూస్తున్నట్ట అనిపించి భయం వేసింది. చీకట్లోకి చూశాను. చీకటి తప్ప ఏదీ కనబడలేదు.

'నాకు తెలియదు కానీ, నేను బాగా జబ్బుపడ్డట్టు కనిపించేవాడినట అందరికీ. ఓసారి నేనింతగా ఏం చేస్తున్నానో తెలుసుకోవాలని నా అన్నలు రహస్యంగా నన్ను వెంబడించారట. నేను ఒంటరిగా నాలో నేను మాట్లాడుకుంటూ ఆడుకుంటున్నానట. అప్పుడప్పుడు కొన్ని అడుగులు గాల్లోకి ఎగురుతున్నానట. అదిచూసి వాళ్లు అమ్మకు చెప్పారు. అమ్మ ఏడుస్తూ నాన్నకు చెప్పింది. ముందు నాన్నగారు పట్టించుకోలేదు. కానీ, నేను మరీ బలహీనంగా కనిపిస్తుండటంతో ఆయన కంగారుపడ్డారట. ఓ రోజు ఆయన పలకరిస్తే విననట్టు, ఎవరో తెలియనట్టు ప్రవర్తించానట. డాక్టరు దగ్గరకు తీసుకువెళ్లారు. డాక్టరు నాకే జబ్బు లేదన్నాడు. దాంతో మావాళ్ళ కంగారు మరింత పెరిగింది. నన్ను కదలనీయకుండా ఎవరో ఒకరు వెంట ఉండేవారు. అప్పుడు పడుకునేవాడిని. వాళ్లు నా శరీరానికి కాపలా కాసేవారు. నేను బయట హాయిగా ఆ అబ్బాయితో ఆడుకునే వాడిని'.

ఎందుకో అతడి గొంతు మారినట్టు నాకనిపించింది. ఎప్పుడు మారిందో గమనించలేదు కానీ, అతడి గొంతు పది, పన్నెండేళ్ల పిల్లవాడి గొంతులా ధ్వనిస్తోంది.

'రోజురోజుకీ క్షీణిస్తున్న నన్ను చూసి కంగారుపడ్డారు మావాళ్లు. చివరికి గాలిమార్పు వల్ల ఫలితం ఉంటుందని, నన్ను మా అమ్మమ్మ వాళ్ల ఊరికి తీసుకువెళ్లారు చిత్రంగా, అక్కడ నా ఆరోగ్యం మెరుగయింది. కానీ, ఎన్నాళ్లని అమ్మమ్మ దగ్గర ఉంచుతారు? అందుకని, మళ్లీ ఊరికి పిలిపిం

చారు' అని నావైపు తిరిగాడు. అతడి కళ్లు ఎలాగో మారాయి. ఎటో చూస్తున్నాడు.

నా వైపు తిరిగాడు కానీ, నన్ను చూస్తున్నట్టు లేదు.

నేను ఊరికి వచ్చాను. రాగానే నా స్నేహితుడి కోసం వెతికాను. వాడు కోపంగా ఉన్నాడు. నన్ను చూడగానే 'నన్ను వదిలి వెళ్తావా?' అని గుడ్లురిమాడు.'

వింటున్న నాకు భయంతో ఒళ్లంతా కంపించింది. ఎందుకంటే రాజు నాకు చెప్తున్నట్టులేదు. నన్ను అడుగుతున్నట్టుంది. కథ చెప్తూ, కథ అనుభవిస్తూ, తానే కథలో పాత్ర అయినట్టున్నాడు.

'నేను భయంతో వణికిపోయాను' ఇంకెప్పుడు వదిలి వెళ్లనని వాగ్దానం చేశాను.

'నన్ను వదిలివెళ్లాలని ప్రయత్నిస్తే చంపేస్తాను' అని బెదిరించాడు. ఆ తరువాత మళ్లీ మామూలుగా ఆడేడు. కానీ, ఎందుకో నన్ను పరిశీలనగా చూస్తున్నట్టే కనిపించేది. అయితే, ఊరు రాగానే, నేను మళ్లీ మామూలుగా అనారోగ్యం పాలవటంతో మా వాళ్లకి ఆందోళన పెరిగింది. ఇంతలో మా అమ్మకి ఊళ్లో వాళ్లెవరో ఓ భయంకరమైన సత్యం చెప్పారు.'

'ఏమిటది?' భయం అంటే ఏమిటో నా అనుభవానికి వస్తోంది.

ఆ ఇంట్లో ఉన్న కుటుంబానికి చెందిన ఓ పిల్లవాడు హఠాన్మరణం చెందాడట. అప్పటినుంచీ ఆ ఇంట్లో అడుగుపెట్టిన పిల్లలెవరూ బ్రతికి బట్టకట్టలేదట. అందుకే ఎవరూ ఆ ఇంట్లో ఉండరట. ఇది తెలియక మా నాన్నగారు ఆ ఇంట్లో ఉండటానికి సిద్ధమయ్యారు. అందుకే ఆ ఇంటి ఓనరు తక్కువ రెంటుకి అంత పెద్దబంగళా అద్దెకిచ్చాడు.

మా అమ్మ మాటలు నాన్న నమ్మలేదు. చివరికి అమ్మపోరు భరించలేక ఇంటి ఓనరును కలవటానికి వెళ్లారు. తీరాచూస్తే మరో భయంకర సత్యం తెలిసింది. పిల్లవాడు చనిపోయిన బాధతో ఆ ఇంటి ఓనరు కూడా ఆత్మహత్య చేసుకున్నాడట.'

నా రోమాలు నిక్కపొడుచుకున్నాయి. 'మరి మీ నాన్నగారితో మాట్లాడినది ఎవరు?'

'అదే నాన్నగారికి అర్థం కాలేదు. కానీ అప్పుడర్థమయింది. ఊళ్లో వాళ్లెవరూ మా జోలికి ఎందుకు రావటం లేదో, నాన్నగారు, ఇంటికి పరుగుపరుగున వచ్చారు. తెల్లారే ఇల్లు వదిలి వెళ్లిపోదామన్నారు'. ఎందుకో ఏదోరకమైన జలదరింపు నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. గుండెపై ఒత్తిడి పెరుగుతోంది.

'ఆ రాత్రి భయంకరమైన అనుభవాన్ని మిగిల్చింది. సామాన్లు అందులో సర్దుతూంటే, ఆ పిల్లవాడు ఇంటిబయటవచ్చి నిలబడ్డాడు. నన్ను కోపంగా చూశాడు. 'నువ్వు వెళ్లటానికి వీల్లేదు' అన్నాడు. 'నిన్ను వెళ్లనీయను' అన్నాడు. నాకేం చేయాలో తోచలేదు. ఏదీ నా చేతుల్లో లేదు. భయంతో ఏడవటం మొదలు పెట్టాను. సామాన్లన్నీ సర్దారు. కానీ ఎడ్ల బళ్లు రాలేదు. దారిలో బురదలో కూరకుపోయాయట. ఏదైనా వాహనం తెస్తానని నాన్నగారు వెళ్లారు. మేమంతా సామాన్లు బయట పెట్టి కూచున్నాం. అంతా నిశ్శబ్దంగా ఉంది.

నేను నా అన్నల నడుమ కూచున్నాను. నా వెనుక అమ్మ ఓ చేయి నా తలపై వేసి ఉంచింది. ఇంతలో నాన్నగారు లారీని తెచ్చి ఇంటి ముందు ఆపారు. సామాన్లు లారీలో ఎక్కించటం ఆరంభించారు.

నిరాసక్తంగా చూస్తున్న నా గుండె ఆగింది. చెట్టుచాటు నుంచి ఎర్రబడ్డ కళ్లతో బుసలుకొడుతూ ఆ పిల్లవాడు నన్నే చూస్తున్నాడు. అతడి కళ్లు నిప్పులు కక్కుతున్నాయి. అతడి ఒళ్లంతా రక్తం కారుతోంది. తనని తాను హింసించుకుంటున్నాడా అబ్బాయి. నా వైపు కోపంగా చూస్తూ.

'ఒద్దు' గట్టిగా అరిచాను. ఆ అబ్బాయిని ఆపాలని లేచాను' అని నా వైపు చూసి నవ్వాడు రాజు. 'ఆ తరువాత జరిగింది నాకు తెలియదు. నేను గాలిలో ఎగిరానట. కప్పలా గెంతుతూ నాలుగయిదు అడుగులు, దాట్లు పెడుతూ దూకానట. అందరూ హాహాకారాలు చేశారు. జరిగేది చూస్తూ భయంతో కొయ్యబారిపోయారు. నేను గెంతినప్పుడల్లా మరింత ఎత్తుకు ఎగురుతున్నానట. నన్ను ఆపాలని నాన్నగారు ప్రయత్నిస్తే అందకుండా ఎగిరానట. క్రింద పడ్డప్పుడల్లా దెబ్బలు తగులుతున్నాయట. ఇంతలో ఎవరో ముసలాయన చెట్ల చాటు నుంచి వచ్చి నన్ను కర్రతో కొట్టాడట. నేను క్రింద పడగానే అమ్మ పరుగున వచ్చి నన్ను ఎత్తుకుని బయటకు పరుగెత్తింది. వెంటనే అందరూ సామాన్లు వదిలి పరుగెత్తారు. లారీ స్టార్ట్ చేసి వేగంగా పరుగెత్తించారు' ఊపిరి బిగబట్టిన నేను దీర్ఘంగా వదిలాను. నిట్టూర్చాను.

'ఇంతకీ ఆ ముసలాయన ఎవరు?' అడిగాను.

నవ్వాడు రాజు.

'నాన్నగారు తరువాత చెప్పారు. ఆ ముసలాయనే ఆ ఇంటిని నాన్నకు అద్దెకిచ్చిన వాడట'.

'అంటే... అంటే..' నా నోట మాట రాలేదు.

విచిత్రంగా నవ్వాడు రాజు. 'నమ్మకం కుదరటం లేదు కదా? ఇదిగో ఇప్పుడు మనమున్న రెస్ట్ హౌస్‌ను ఆ బంగళాను కూల్చికట్టారు. ఇదే స్థలంలో నేను ఎలా ఎగిరానో తెలుసా?' అడిగాడు విచిత్రంగా నవ్వుతూ.

అతడి మాటలు నాకు అర్థమయ్యేలోగా, గాల్లోకి ఎగిరాడు పెద్దగా అరుస్తూ.

అలా ఎగిరి నేలపై దూకాడు. నేలను కొట్టిన బంతిలా మళ్లీ గాల్లోకి ఎగిరాడు.

మళ్లీ నేలపై పడ్డాడు మళ్లీ గాల్లోకి ఎగిరాడు.

అలా చీకట్లో కలిసిపోయాడు.

నాకు నోట మాట రాలేదు. వణుకుతూ అలా నిలబడిపోయాను.

చీకట్లో అడుగుల చప్పుడు వినిపించింది. ఏదో ఆకారం వెలుతురులోకి వచ్చింది. పెద్దగా అరిచాను. శబ్దం బయటకు రాలేదు. గడగడ వణుకుతున్నాను. అలాగే నిర్ఘాంతపోయి చూస్తున్న నా దగ్గరకు నా ఫ్రెండు వచ్చాడు.

నా భుజం మీద చేయి వేశాడు.

'రాజు... రాజు...' అన్నాను రాజు అదృశ్యమైన వైపు వేలు చూపుతూ

తల ఊపాడు నా ఫ్రెండు.

'నాకూ ప్రొద్దుటినుంచీ చెప్పలేదు. పెళ్లి పనులు పాడవుతాయని. పెళ్లికి వస్తున్న రాజుకు ఊరి పొలిమేర్లలో ఏక్సిడెంట్ అయిందట. మరణించాడట. నాకు ఇప్పుడే చెప్పారు. మనసు పాడయిపోయింది. నీ నిద్ర డిస్టర్బ్ చేస్తానేమోననుకున్నాను. అయినా సరే నీతో బాధ పంచుకుందామని వచ్చాను.' నా ఫ్రెండు మాటలు నాకు వినబడలేదు. అప్పటికే నేను స్పృహ తప్పి పడిపోయాను.



## నమితను నమ్ముకొని...

'సింహా' సక్సెస్ తరువాత టాలీవుడ్ నిర్మాతలకి నమిత మీద బోలెడంత నమ్మకం వచ్చేసినట్లుంది. ఆ సినిమా సక్సెస్‌లో మిగతా ఇద్దరు హీరోయిన్ల కన్నా నమిత గ్లామరే ఎక్కువ వర్క్ అవుట్ కావడంతో తెలుగులో పలువురు చిన్న నిర్మాతల దృష్టి నమిత మీద పడిందట! కోలీవుడ్‌లో నమిత అందాల కారణంగా విజయవంతమైన దాదాపు అరడజను చిత్రాలను తెలుగులోకి డబ్ చేసే పనిలో ఆ నిర్మాతలు పడ్డారట! కాకపోతే తమిళ తంబిలకు నమిత అందాలు నచ్చినట్టు మన తెలుగు తమ్ముళ్ళకి నచ్చకపోవచ్చు అన్న అనుమానాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నా... పెద్దగా పట్టించుకోకుండా నమితను నమ్ముకొని రంగంలోకి దూకుతున్నారు. వీరి పరిస్థితి ఇలా ఉంటే, నమిత మాత్రం తెగ సంతోషపడిపోతోందట! తెలుగులో తిరిగి తనకు పూర్వ వైభవం రావడం ఖాయం అని అంటోందట! పూర్వ వైభవం వస్తుందో...లేక తిరిగి టాలీవుడ్ వైపు చూడకుండా పరుగు తీస్తుందో వేచి చూడాల్సిందే!